క్లుప్తంగా

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చింతపల్లి: చింతపల్లి, గూడెంకొత్తవీధి మండలాల్లో శుక్రవారం జంగిల్ క్లియరెన్స్ చేపడుతుండడంతో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ వెంకటరమణ తెలిపారు. ఆయా మండలాల్లో విద్యుత్ లైన్లపై ఉన్న చెట్ల కొమ్మలు తొలగించేందుకు సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

జి.మాడుగుల: మండలంలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఈఈ ఎ.వి.ఎస్.ఎం.అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. పాడేరు నుంచి జి.మాడుగుల వరకు 33కెవీ లైన్ మీద ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు, ఇతర నిర్వహణ పనుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

విద్యార్థులకు పాటల పోటీలు



కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు

దుంబ్రిగుడ: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు పాటల పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి సునీత మాట్లాడుతూ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేయనున్నట్టు చెప్పారు. వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

దివ్యాంగుల వైద్య శిబిరం వాయిదా

చింతపల్లి: మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించాల్సిన దివ్యాంగుల వైద్య శిబిరం వాయిదా పడినట్టు ఎంపీడీవో లాలం సీతయ్య తెలిపారు. విశాఖపట్నంలోని ప్రైవేట్ ఆస్పత్రి సహకారంతో దివ్యాంగులు, ఎముకలకు సంబంధించిన వైద్య శిబిరం ఏర్పాటు చేయాల్సి ఉండగా, అనివార్య కారణాల వల్ల రద్దు చేసినట్టు పేర్కొన్నారు. సమాచారాన్ని స్థానికులు తెలియజేసేలా పంచాయితీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు.

గ్రామాల్లో తాగునీటి సమస్యకు పరిష్కారం



తామరపల్లిలో బోరును రిపేరు చేస్తున్న ఎంపీటీసీ వంశీ

రంపచోడవరం: మండలంలోని తామరపల్లి సచివాలయన్ని మురురుమిల్లి ఎంపీటీసీ సభ్యుడు కుంజం వంశీ బుధవారం సందర్శించారు. స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇందులో భాగంగా గ్రామంలో తాగునీటి బోరు పాడైనట్టు పలువురు చెప్పారు. స్పందించిన ఆయన బోర్ మెకానిక్‌కు సమాచారం అందించారు. పాడైన బోరుకు మరమ్మతుకు మెకానిక్‌తో కలిసి పనిచేశారు. తామరపల్లి, ఎం.బురుగుబందా గ్రామంలో హ్యాండ్ పంపులను రిపేర్ చేయించారు. గ్రామాల్లో నీటి సమస్య ఎక్కడ ఉన్న తెలియజేస్తే సమస్య పరిష్కరిస్తామన్నారు. ఆయనతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు కుంజం అబ్బులు, వీక బాబూరావు, కుంజం చెల్లన్న దొర, కోసు వెంకట్రావు, వలంటీర్లు తదితరులున్నారు.

ఇంటింటా ధర్మ ప్రచారం



ధర్మ ప్రచార కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మోదకొండమ్మతల్లి ఆలయ కమిటీ ప్రతినిధులు

సాక్షి, పాడేరు : సమర సత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం నుంచి ఈనెల 25వ తేదీ వరకు ఇంటింటా చేపట్టే ధర్మప్రచార కరపత్రాలను మోదకొండమ్మతల్లి ఆలయంలో ఆవిష్కరించారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుల్లి సింహాచలంనాయుడు, సమర సత సేవా ఫౌండేషన్ ప్రతినిధులు సుబ్బారావు, తమర్బ ప్రసాద్‌నాయుడు, బోడిగ బాలంనాయుడు, దేశిది బాబురావు, రామారావు, శ్రీనివాసరావు కరపత్రాలను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లో ఎర్పటించి ధర్మ పరిరక్షణపై విస్తృత అవగాహన కల్పిస్తామన్నారు. పాడేరులో పలు ప్రాంతాల్లో ప్రజలకు ఈ కరపత్రాలను పంపిణీ చేశారు.

పల్లెలకు మార్గం.. సుగమం



దిబ్బపాలెం- పినకోట, పెదకోట వరకు చేపడుతున్న మరమ్మతు పనులు

- దిబ్బపాలెం- పెదకోట రోడ్డుకు మరమ్మతు పనులు
- 5.8 కిలోమీటర్ల రహదారికి 1.50కోట్లు నిధులు మంజూరు
- గిరిజనుల హర్షం



గతంలోని వర్షాలకు గోతులమయంగా మారిన పినకోట- పెదకోట రహదారి

అనంతగిరి: మండలంలోని మారుమూల పినకోట, పెదకోట రహదారి మరమ్మతు పనులతో మార్గం సుగమమైంది. పదేళ్ల క్రితం దేవరాపల్లి నుంచి జీనబాడు, పినకోట, పెదకోట, కివర్ల పంచాయతీలను కలుపుకుంటూ జాలడ గ్రామం వరకు విడతల వారీగా ట్రైబల్ వెల్ఫేర్‌లో సుమారు రూ.6కోట్లతో రహదారి నిర్మాణం చేపట్టారు. ఏళ్ల సమస్య పరిష్కారం కావడంతో నాలుగు పంచాయతీల గిరిజనులు ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. అయితే పనులపై నిర్వహణ లేకపోవడంతో రహదారి అస్తవ్యస్తంగా మారింది. వర్షాలకు పూర్తిగా గోతులమయంగా మారింది. ప్రయాణాలకు గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ రహదారి ఆర్‌అండ్‌బీశాఖ పరిధిలోకి రావడంతో మోక్షం కలిగింది.

దిబ్బపాలెం నుంచి పినకోట, పెదకోట వరకు మరమ్మతులు

దిబ్బపాలెం నుంచి పినకోట, పెదకోట పంచాయతీలకు వెళ్లేందుకు రహదారి పూర్తిగా అస్తవ్యస్తంగా మారింది. పెద్ద పెద్ద గోతులతో రహదారి ప్రమాద భరితంగా మారింది. దీంతో వాహనచోదకులు తరచూ ప్రమాదాలకు గురయ్యేవారు. ఈ నేపథ్యంలో ఆయా రహదారి మరమ్మతుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా మొదటి విడతగా ఆర్‌అండ్‌బీ శాఖ దిబ్బపాలెం నుంచి పినకోట, పెదకోట వరకు 5.8 కిలోమీటర్లకు గాను, 1.50కోట్లతో గత నెలలోని మరమ్మతు పనులు చేపట్టారు. దీంతో పినకోట, పెదకోట వరకు మార్గం సుగమమైంది. పెదకోట నుంచి కివర్ల పంచాయతీ జాలడ వరకు మరమ్మతు పనులు చేపట్టాల్సి ఉంది. దిబ్బపాలెం నుంచి జీనబాడు వరకు సుమారు రూ.10 లక్షలతో మరమ్మతు పనులకు సంబంధించి ప్రస్తుతం టెండర్ ప్రక్రియలో ఉంది.

నాణ్యత ప్రమాణాలతో పనులు

దిబ్బపాలెం నుంచి పినకోట, పెదకోటవరకు నాణ్యతప్రమాణాలతో మరమ్మతులు చేపట్టాం. దిబ్బపాలెం నుంచి జీనబాడు వరకు మరమ్మతులకు టెండర్ ప్రక్రియలో ఉంది. టెండర్ పూర్తికాగానే పనులు చేపట్టేవిధంగా చర్యలు చేపడతాం.

– నాగేంద్ర,ఏఈ(అరకు ఇన్‌చార్జి), ఆర్ అండ్ బీ శాఖ

ప్రజల చెంతకే పాలన



గిరిజనులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి

పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి

చింతపల్లిరూరల్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని పెదబరడ పంచాయతీ పరిధిలోని బుధవారం వంగసార, లోతుగెడ్డ జంక్షన్, కృష్ణాపురం, తెరపల్లి, మడిగుంట, సిరిపురం గ్రామాల్లో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో 247 గడపలను ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి యోగ క్షేమాలతో పాటు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. రాష్ట్రాభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డికే ఓటు వేస్తామని నినాదించడంతో ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కొట్టగుల్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సేవలు దేశానికే ఆదర్శంగా నిలిచాయమన్నారు. ప్రధాని మోదీ కూడా ముఖ్యమంత్రిని ప్రశంసించారన్నారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థతో ప్రజల వద్దకే ప్రభుత్వ పాలన చేరవైందన్నారు. అర్హత ఉండి ఎవరికైనా పథకాలు అందకపోతే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. అనంతరం గ్రామంలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఎంపీపీ కోరాబు అనూషా దేవి, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు దురియా పుష్పలత, సర్పంచ్ గోపాల్, మండల పార్టీ అధ్యక్షుడు మోరి రవి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ మీరా, అరకు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి గణబాబు, ఎంపీటీసీ సభ్యుడు లోవరాజు, కో-ఆప్షన్ సభ్యుడు నాజర్‌వలీ, పంచాయితీ కార్యదర్శి పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు ఉపాధి పనులు



పైడిపుట్టలో ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో బాపన్నదొర

అడ్డతీగల: నిబంధనలు అనుసరించి పారదర్శకంగా ఉపాధి హామీ పనులు చేయించాలి ఎంపీడీవో కె.బాపన్నదొర అన్నారు. అడ్డతీగల మండలంలోని పైడిపుట్ట, రాయపల్లి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకంలో భాగంగా నిర్వహిస్తున్న భూమి చదును పనులను ఆయన బుధవారం పరిశీలించారు. ప్రతిపాదనల్లో పేర్కొన్న విధంగా భూమి చదును పనులు చేయించాలన్నారు. వీలైనంత మేరకు ఎక్కువ మంది వేతనదారులు ఆయా పనులు చేసేలా చూడాలని సిబ్బందికి సూచించారు. మండల వ్యాప్తంగా 22 గ్రామ పంచాయతీల్లోని 59 గ్రామాల్లో ప్రస్తుతం రూ.2.15 కోట్లు విలువైన 64 పనులు జరుగుతున్నాయన్నారు. 2,553 మంది వేతనదారులు ప్రస్తుతం ఆయా పనుల్లో పాల్గొంటున్నారని చెప్పారు. ప్రతి రోజు 6 వేల నుంచి 7 వేల మంది వేతనదారులు పనుల్లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు.అన్ని గ్రామాల్లో డిమాండ్ మేరకు పనులు కల్పిస్తామని క్షేత్రస్థాయి సిబ్బంది చెప్పారన్నారు. ప్రస్తుతం నీటి నిల్వ సంరక్షణకు చెరువులు, జీడిమామిడి మొక్కల చుట్టూ కందకాలు, పంట కాలువల పూడికతీత, పుంత రోడ్లు, సరిహద్దు కందకాలు తదితర పనులు చేపట్టామన్నారు.

సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం



కొర్రా గ్రామస్తులతో మాట్లాడుతున్న నాయకులు

దుంబ్రిగుడ: మండలంలోని కొర్రా పంచాయతీ కేంద్రంలో అరకు సర్పంచ్, మండల ఫోరం అధ్యక్షుడు రమేష్, వైస్ ఎంపీపీ ఆనందరావు, నాయకుడు బాక సింహాచలం తదితరులు బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ మరింత బలోపేతం కోసం కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. పార్టీ శ్రేణులు గ్రామాల్లో పర్యటించి, సంక్షేమ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేసి, అందరికీ అందేలా చూడాలన్నారు. గ్రామ సచివాలయ కన్వీనర్ గణపతి, నర్సింగ్, బాలరాజు, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు

హుకుంపేట: మండలంలో సంతరి పంచాయతీ పంత్రిమెట్ట గ్రామంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ మినీ ఆయా పోస్టు భర్తీకి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో బాలచంద్రమణిదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు స్థానిక నివాసం కలిగి 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. పదో తరగతి ఉత్తీర్ణత సర్టిఫికెట్, ఆధార్, కుల ధ్రువీకరణ జెరాక్స్ పత్రాలతో దరఖాస్తులను ఈనెల 18వ తేదీ సాయంత్రం 5గంటలలోగా అందజేయాలని మరిన్ని వివరాలకు ఐసీడీఎస్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

చింతపల్లి రూరల్: అంగన్‌వాడీలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐసీడీఎస్ సీడీపీవో ఎం.రామలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని తమ్మంగుల పంచాయతీ కుమ్మరి వంచుల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఆయా పోస్టు ఖాళీ ఉన్నట్టు తెలిపారు. అభ్యర్థులు స్థానికంగా నివాసమై, పదో తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తులను ఈనెల 17వ తేదీలోగా కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన



కార్యక్రమం ప్రారంభిస్తున్న నేచర్ సంస్థ డైరెక్టర్ వికాస్ బాలరాజు

దుంబ్రిగుడ: గిరిజన యువతకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించేందుకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని నేచర్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ వికాస్ బాలరాజు చెప్పారు. మండల కేంద్రంలోని సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. మండల పరిధిలోని కురిడి, సాగర, సొవ్వ తదితర పంచాయతీలకు చెందిన 300 మంది గిరిజన యువతకు తొలి విడతగా ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై విస్తృత అవగాహన కల్పించినట్టు ఆయన చెప్పారు. సంస్థ ప్రతినిధులు పట్నాయక్, సంతోష్, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

రాగి జావ పంపిణీకి స్టీల్ గ్లాసులు



ప్రభుత్వం సరఫరా చేస్తున్న స్టీల్ గ్లాసులు

బుచ్చెయ్యపేట: జగనన్న గోరుముద్ద కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు రాగిజావ అందించేందుకు స్థానిక మండల విద్యా వనరుల కేంద్రానికి స్టీల్ గ్లాసులు చేరాయి. మండలంలో 35 పంచాయతీల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు రాగి జావ అందించేందుకు స్టెయిన్‌లెస్ స్టీల్ గ్లాసులను ప్రభుత్వం సరఫరా చేసింది. మండలంలోని 58 పాఠశాలల్లో 5,600 మంది విద్యార్థులు ఉన్నారు. వీరందరికీ కొత్త విద్యా సంవత్సరం ప్రారంభంలో రోజూ రాగి జావ అందేలా చేస్తామని ఎంఈవో చంద్రశేఖర్ తెలిపారు. **రోలుగుంట:** స్థానిక విద్యా వనరుల కేంద్రానికి వాహనంపై బుధవారం జిల్లా విద్యా శాఖ కార్యాలయం నుంచి 3,161 స్టీల్ గ్లాసులు వాహనంలో వచ్చాయి. వీటిని ఇక్కడ ఉద్యోగి రుత్తల సత్తిబాబు లెక్క చూసుకున్నారు. ఈ సందర్భంగా మండలంలోని 54 పాఠశాలల్లో విద్యార్థులందరికీ త్వరలోనే ఎంఈవో సాయిశైలజ ఆదేశాలతో ప్రధానోపాధ్యాయులు పంపిణీ చేస్తారని ఆయన వివరించారు.

విరగ్గాసిన సపోట



చెట్టుకు సపోట పండ్లు

అనంతగిరి: మండలంలోని కాశీపట్నం గ్రామంలోని ఓ గిరిజనుడు ఇంటివద్ద సపోట చెట్టుకు పండ్లు విరగ్గాశాయి. ఏజెన్సీలోని పలు గ్రామాలకు చెందిన గిరిజనులు ఇటీవల సపోట చెట్లను నాటారు. అనుకూలంగా ఉన్న ప్రదేశాల్లో పండ్లు దిగుబడి బాగుంది. అయితే కాశీపట్నం గ్రామంలో ఓ గిరిజనుడి ఇంటి ఆవరణలో చెట్టు కొమ్మకు కొమ్మకు విరగ్గాసిన సపోట పండ్లు ఆకట్టుకుంటున్నాయి.

రైతులకు కోళ్లు పంపిణీ



రైతులకు కోళ్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ శైలజ

పాయకరావుపేట : మండలంలో గల వి.కొత్తూరు గ్రామంలో రైతులకు ఎస్సీ సబ్‌ప్లాన్‌లో భాగంగా యలమంచిలి కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ఆధ్వర్యంలో మేకలు, కోళ్లు, మేత తొట్టిలు, నీటి తొట్టిలు పంపిణీ చేయడం జరిగిందని కేవీకే సీఈవో జి.వి. సత్యనారాయణ తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం బీసీటీ, కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె.శైలజ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శైలజ మాట్లాడుతూ కేవీకే ద్వారా హరిజన రైతులకు ఇస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేవీకే పశు వైద్య శాస్త్రవేత్త డాక్టర్ రజని, వ్యవసాయ యంత్రీకరణ శాస్త్రవేత్త శ్రీకాంత్ రైతులకు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణ ప్రసాద్, కోఆర్డినేటర్ సూర్యానారాయణ, కృష్ణ పాల్గొన్నారు.

ప్రైవేటు స్కూళ్లలో ఉచిత ప్రవేశాలకు దరఖాస్తులు

దేవరాపల్లి: ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం సెక్షన్ 12(1)(సీ) ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో 2023–24 విద్యా సంవత్సరానికి రెండో విడత 25 శాతం ఉచిత ప్రవేశాలకు ఈ నెల 15 వరకు గడువు ఉందని ఎంఈవో సిహెచ్. రవీంద్రబాబు బుధవారం తెలిపారు. ఒకటో తరగతిలో ప్రవేశానికి గాను తల్లిదండ్రులు తమ పిల్లల వివరాలను ఆన్‌లైన్లో అప్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. అన్ని ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం సీట్లలో ఉచిత ప్రవేశాలు కల్పిస్తామన్నారు. నిర్ణీత గడువులోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

తాటి ముంజెలకు గిరాకీ



మునగపాకలో తాటిముంజెల అమ్మకాలు

మునగపాక : వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు పలువురు తాటి ముంజెలను ఆశ్రయిస్తున్నారు. గ్రామాల్లో దొరికే తాటికాయలతో పాటు ముంజెలను కొనుగోలు చేసేందుకు ఉత్సాహం చూపుతున్నారు. ఇదే అదనుగా అమ్మకందారులు తాటికాయను రూ.10కు విక్రయిస్తున్నారు. డజను ముంజెలను రూ.40 నుంచి రూ.50కు విక్రయిస్తున్నారు. మునగపాక ఎస్‌బీఐ దరి అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి.

పచ్చరొట్ట విత్తనాలు విక్రయానికి సిద్ధం

మాడుగుల రూరల్: సబ్సిడీపై పచ్చరొట్ట విత్తనాలు రైతు భరోసా కేంద్రాల్లో విక్రయానికి సిద్ధంగా ఉంచినట్లు ఏవో ఎం. వాసుదేవరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీలుగ పది కిలోలు రూ.395, జనుము విత్తనాలు పది కిలోలు రూ.420, పిల్లిపెసర విత్తనాలు 8 కిలోలు రూ.388 చొప్పున విక్రయిస్తామని, రైతులు తమ ఆధార్ కార్డుతో రైతు భరోసా కేంద్రాల్లో ముందుగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

దుర్గాలమ్మ జాతర నేడు



రాంబిల్లి : వాడనర్సాపురంలో గురువారం దుర్గాలమ్మ అమ్మవారి జాతరను నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. వాడనర్సాపురం సహా పరిసర గ్రామాల భక్తులు దుర్గాలమ్మ అమ్మవారి జాతరను నిర్వహించుకుంటారు. ఈ గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేస్తారు. ఈ సందర్భంగా పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు.

మోదమ్మ ఇత్తడి ఘటాలకు సంప్రోక్షణ



అమ్మవారి ఇత్తడి ఘటాలను శుభ్రం చేస్తున్న భక్తులు

సాక్షి, పాడేరు: మోదకొండమ్మ తల్లి ఇత్తడి ఘటాల సంప్రోక్షణ (శుభ్రత కార్యక్రమాన్ని) గుడివాడ గ్రామానికి చెందిన ఆధ్మాత్మిక సేవా కమిటీ మహిళలు బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుల్లి సింహాచలంనాయుడు పిలుపు మేరకు గుడివాడ ఆధ్మాత్మిక సేవా కమిటీ మహిళలు కార్యక్రమానికి ముందుకు వచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఘటాల శుభ్రతను విజయవంతంగా చేపట్టారు. వాటిని అమ్మవారి ఆలయంలోకి చేర్చారు. ఈ నెల 14 తేదీ నుంచి మోదకొండమ్మతల్లి ఉత్సవాలు జరుగుతుండడంతో ఆదివారం వాటికి ప్రత్యేక పూజలు అనంతరం భక్తులు ఊరేగించి, సతకంపట్టు వద్ద కొలువుదీరుస్తారు.

ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి



ఫ్యాన్లు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్న ప్రజలు

చింతూరు: సమస్యల పరిష్కారానికి ఐటీడీఏకు వస్తున్న దరఖాస్తుదారులు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. చింతూరు ఐటీడీఏ కార్యాలయంలో ప్రతి బుధవారం స్పందన కార్యక్రమం జరుగుతోంది. ఈ కార్యక్రమానికి చింతూరు, కూనవరం, వీఆర్ పురం, ఎటపాక మండలాలకు చెందిన ప్రజలు హాజరై తమ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తుంటారు. అయితే స్పందన వచ్చే ప్రజలు కూర్చేందుకు ఓ గదిలో కుర్చీలు ఏర్పాటు చేశారు. ఇక్కడ ఫ్యాన్లు లేకపోవడంతో స్పందన వచ్చిన అర్జీదారులు ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఇక్కడున్న ఫ్యాన్‌లను వివిధ కారణాలతో తొలగించారని, ఏడాది కావస్తున్నా ఏర్పాటుచేయలేదని పలువురు చెప్పారు. ఇక్కడ ఆర్‌వో వాటర్ ఫిల్టర్ ఉన్నా నీరు నింపకపోవడంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామంటున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు. ఈ విషయాన్ని ఐటీడీఏ ఏపీవో కంచర్ల సుజాత దృష్టికి తీసుకెళ్లగా ఈ ప్రాంతంలో ఫ్యాన్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సామూహిక సీమంతాలు



సామూహిక సీమంతాలు నిర్వహిస్తున్న స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు

అడ్డతీగల: మండల కేంద్రంలోని వనవాసీ కళ్యాణ్ ఆశ్రమ్ కార్యాలయంలో బుధవారం హిందూ నేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం సామూహిక సీమంతాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి వచ్చిన మండల పరిధిలోని 14 గ్రామాలకు 21 మంది గర్భిణులకు పసుపు కుంకుమ, స్వీట్లు, చీర, గాజులు సహా వాయినాలు సమర్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుధ, హిందూ నేషన్ ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ తోట రామకృష్ణ, సభ్యులు పి.లక్ష్మణ్, వనవాసీ కళ్యాణ్ ఆశ్రమ్ జిల్లా అధ్యక్షుడు బొగ్గుల కాటంరెడ్డి, జిల్లా కార్యదర్శి పి.వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

13న జాతీయ లోక్ అదాలత్

- జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్

నర్సీపట్నం: ఈ నెల 13 నిర్వహిస్తున్న మెగా జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జూనియర్ సివిల్ జడ్జి ఎస్.శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక కోర్టు కార్యాలయంలో న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ న్యాయవాదులు రాజీ పడదగిన కేసుల్లో శ్రద్ధ వహించి ఎక్కువ సంఖ్యలో పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. రాజీమార్గంలో కేసులు పరిష్కరించడం వల్ల కలిగే ప్రయోజనాలను కక్షిదారులకు వివరించాలని సూచించారు. సమావేశంలో ప్రభుత్వ న్యాయవాది వి.బి. రామచంద్రారవు, సీనియర్ న్యాయవాదులు పాక్కునూరు నరసింహం, గొలుసు శంకరరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రావాడ సత్యనారాయణ పాల్గొన్నారు.

త్రిపురాంతక స్వామికి ఘన పుష్పాంజలి



కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

కశింకోట : స్థానిక సర్వమంగళాంబ సమేత త్రిపురాంతకస్వామి ఆలయంలో బుధవారం రాత్రి పుష్పాంజలి కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామి వార్లకు ఇటీవల వైశాఖ పౌర్ణమి రోజు వార్షిక కల్యాణోత్సవాన్ని నిర్వహించిన విషయం తెలిసిందే. కల్యాణ వేడుకల అనంతర కార్యక్రమాల్లో భాగంగా భక్తులు తెచ్చిన పలు రకాల స్వీట్లు, పిండి వంటలు, పండ్లు నివేదించి పుష్పాంజలి జరిపారు. ఈ సందర్భంగా భక్తులు భక్తి పాటలు ఆలపించి పూజలు చేశారు. ఆలయంలో సర్వమంగళాంబ అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి 108 ఏళ్లు పూర్తయిన సందర్భంగా 108 దంపతులకు తాంబూల ప్రసాదాలను పంపిణీ చేశారు. పుష్పాంజలికి హాజరైన భక్తులతో ఆలయం కళకళలాడింది. పూజల అనంతరం ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమాలను ఆలయ అర్చకులు వి.శంకరం, వి.చిదంబరం, వి.కృష్ణలు పర్యవేక్షించారు.

నేడు పైడితల్లమ్మ జాతర

ఎస్.రాయవరం : ఉప్పరాపల్లిలో గురువారం పైడితల్లమ్మ జాతర గురువారం ఘనంగా నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. అమ్మవారి జాతరను ఏటా వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ. యువత పోటాపోటీగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధనకు ఏర్పాట్లు చేస్తున్నారు.